# ఇదిగో.. వదినగారూ!

మురళి సుబ్బారావు

"గురూ గారూ! ఒక సిగరెట్ ఉంటే ఇస్తారా. కాల్చుకుని మళ్ళీ ఇచ్చేస్తాను" అన్నాడు అనంతరావు ఆఫీస్‌లో బిజీగా రాసుకుంటున్న నాదగ్గరికొచ్చి.

నవ్వొచ్చింది నాకు. జేబులోంచి సిగరెట్ తీసి ఇచ్చాను.

"ఏం గురూగారూ అలావున్నారు" అన్నాడు అనంతరావు ఇచ్చిన సిగరెట్‌కి నిప్పు పెడుతూ.

"ఏం లేదు" అన్నాను. ముక్తసరిగా.

'లేదాసర్. ఏదో వుంది. ఎప్పుడూ హుషారుగా వుండేమీరు ఇవ్వాళ ఏదోలా వున్నారు. కారణం చెప్పాల్సిందే" అన్నాడు.

"ఏం లేదన్నానుగా".

"అబద్ధ మాడకండి గురూ గారూ. 'ఆఫీసులో అబద్ధ మాడితే ఆఫీసర్ పిలిచే టైంలో ఒక్క పనిచేయక పోవడం, అర్జెంటు వర్కు పెండింగయి పోవడం, సమయానికి సిగరెట్టిచ్చే వాడు దొరక్క పోవడం లాంటి ఇబ్బందులు కలుగును" అన్నాడు.

ఇక తప్పదు. సీట్లోంచి లేచాను.

"పద అలా కేంటీన్‌కి వెళదాం".

కేంటీన్‌కి చేరుకున్నాం.

నేను ఈ ఆఫీస్‌లో చేరి రెండేళ్ళయింది. ముందుగ పరిచయం కలిగింది అనంత రావుతోటే. ఇద్దరం ఒక వయసు వాళ్ళమే. చాలా విషయాల్లో నా పని తీరును బట్టి అనంతరావు నాకు దగ్గరయ్యాడు. 'గురూ గారూ' అని పిలుస్తుంటాడు.

ఇవాళ నాకొచ్చిన సమస్య ఇప్పటిది కాదు. సుమారు నెల రోజులుగా జరుగుతోంది. నిన్న రాత్రి మరి తీవ్రమయింది. అందుకే ఇవ్వాళ అదో మాదిరిగా వున్నాను.

"చెప్పండి గురూగారూ" అన్నాడు అనంతరావు.

"చాలా జాగ్రత్తగా విను అనంతూ. నాకు చాలా వర్రీగా వుంది. నువ్వే దిన్ని పరిష్కరించాలి. మా ఆవిడ ఈ మధ్య మాప్రక్క వాటాలో వుంటున్నామె మాటలు విని......"

మధ్యలో నవ్వుతూ అన్నాడు అనంతరావు" ఇంట్లో సమస్యా? నాకర్థమయింది. వైఫ్ అనే మాట స్పెల్లింగుకి అర్థమే వేరు సార్. వర్రీస్ ఇన్‌వైట్స్ ఫర్ ఎవర్. చెప్పండి మీ వర్రీ ఏమిటో"

నేను చెప్పడం మొదలు పెట్టాను.

"నాగురించి మొదట్నుంచీ చెప్పాలి. చదువుకున్న రోజుల్లో పుస్తకాలు తప్ప వేరే ధ్యాస లేదు నాకు. బజారుకి వెళ్ళి ఏ పనీ చేసే వాణ్ణి కాదు. అమ్మ, నాన్నగారు, చెల్లాయి చూసుకునే వారంతా. నాకు బొత్తిగా ఏమీ తెలీదంటే నమ్ము. నెలరోజుల క్రితం పెళ్ళయింది. నీకు తెలుసుగా. సుజాతను నాతో కాపురానికి పంపిస్తూ మా అమ్మ ఏమన్నదో తెలుసా? ఒరే బాబ్బీ! ఇప్పట్నుంచి ఒకళ్ళ కిద్దరయ్యారు. సంసారాన్ని జాగ్రత్తగా చూసుకో. నీ పెళ్ళానికి ఏ ఇబ్బంది వచ్చినా నువ్వు ఇబ్బందుల్లో పడతావు. ఇక్కడంటే ఏదో సరిపోయింది. ఇంట్లోకి ఏం కావాలో చూసుకో. మార్కెట్‌కి వెళ్ళి సరుకులు తేవడం గట్రా అలవాటు చేసుకో అని చెప్పింది మా అమ్మ. ఆ మాట పట్టించుకోలేదు నేను. ఇప్పుడు సమస్యగా మారింది."

ఇంతలో టీ వచ్చింది. ఇద్దరం టీ తాగుతుంటే నెల క్రితం సుజాతను కాపురానికి తీసుకు వచ్చి నప్పట్నుంచీ జరిగిన సంఘటనలు చెప్పనారంభించాను.

* * *

ఆ రోజు ఫస్ట్ షోసినిమా ప్రోగ్రాం వుంది. త్వరగా ఇంటికి వెళ్ళాను ఆఫీసు నుంచి సుజాత ఇంకా వంటగదిలో నే వుంది.

"ఇంకా తయారవలేదు. టైమవుతోంది" అన్నాను.

"అయిపో వచ్చింది. ఒక్క పది నిముషాలు టేబుల్ మీద ఫ్లాస్కులో టీ వుంది. తాగండి. నేను తెమిలే సరికి బజారుకి వెళ్ళి కూరలు పట్రండి" అంది సుజాత కూరల సంచి చేతికిస్తూ.

సుజాత సంచి చేతికివ్వడంతో మొదలయింది సమస్య. కూరలేం తేవాలో తెలీదు. ఎంత ఖరీదంటాయో తెలీదు. బేరమాట్టం అసలే రాదు. ఎలా? తప్పించుకుందుకి అన్నాను.

"ఇద్దరం వెళదాం సుజా"

"బావుంది. వంట వ్వాలి నేను తయారు కావాలి. మీతో నేనూ వస్తే ఇక సినిమాకు వెళ్ళినట్టే" అంది.

వెళ్ళక తప్పలేదు. "ఏం కూరలు తేవాలి" అన్నాను.

"ఏవో ఒకటి పొద్దుటికి వంకాయలు తెండి. రేపు సాయంత్రానికి అరటికాయలేవైనా పట్రండి. పచ్చిమిర్చి, కొత్తిమీర కూడా కావాలి" అంది సుజాత స్నానానికని బాత్రూంలో వెళుతూ.

"పోనీ సినిమాకు వెళ్ళేటప్పుడు కొనుక్కు వెళదాం" అన్నాను.

ధభేలుమని బాత్రూం తలుపేసుకుంటూ అన్నది.

"ఏమిటి మీ వుద్దేశం. సినిమా హాల్లో నా పక్కన నా చెయ్యి పట్టుకుని కూర్చోక ఆ సంచి పట్టుక్కూర్చుంటారా. సరే కొత్తి మీర కాస్త ఎక్కువ పట్రండి" అంది సుజాత.

"ఎందుకూ" అన్నాను అర్థం కాక.

"జడలో తురుముకుంటాను" అంది కోపంగా.

"నిజంగానే తెమ్మంటావా సుజా!"

"నిజంగానే తెండి. ఇందాక మల్లెపూలు అమ్మొస్తే కొన్నాను. అవి పనిమనిషి కిచ్చేస్తాను. వాళ్ళాయనతో అది సినిమా కెళుతుందిట!"

"సర్లే! అంత పని చెయ్యకు. బజారు కెళుతున్నాను. అరటికాయ లెన్ని తేవాలి. ఒక అరకేజి చాలా?" అన్నాను.

ఆ మాటకు సుజాత పడి పడి నవ్వింది. "అవి కేజీల్లో ఇవ్వరండి. కాయల లెక్కన ఇస్తారు. రెండు తీసుకురండి" అంది.

"కేజీ లెక్కన ఎందు కివ్వరూ? హైదరాబాదులో మామిడిపళ్ళు కేజీల్లోనే కదా ఇస్తారు" అన్నాను.

"అది వేరు. మీరు వెళ్ళి రండి. వాడు ఎలా అమ్మితే అలా తీసుకురండి. మీకు బొత్తిగా ఏమీ తెలీదు" అంది.

ఇక తప్పదు. కూరల లిస్టు మననం చేసుకుంటూ బజారుకి బయల్దేరాను.

కూరలు కొన్నాను.

కూరల కొట్టువాడు కూడా ఎందుకో మరి నవ్వేడు. కొత్తిమీర కొమ్మ ఎంత కిస్తున్నావని అడిగాను. అది తప్పా? అవునట. "తప్పు బాబూ అలా అడక్కూడదు. కొత్తిమీర కొమ్మలుగానూ మొక్కలుగానూ అమ్మరు. కట్ట పావలా" అన్నాడు.

ఇన్ని భరించి పావు గంటలో కూరలు తెచ్చాను. తర్వాత సినిమా కెళ్ళొచ్చాం. ఆ రోజు సుజాతకు నాకూ కూడా అర్థమయింది కూరలు కొనడం నాకు రాదని.

మర్నాడు ప్రొద్దుట నాకు ఆఫీస్‌కి క్యారేజి కట్టడానికని వంట చేస్తూ వంకాయలు తరుగు తోంది సుజాత. అప్పుడే వచ్చింది మా పక్క

వాటాలో వదినగారు. సుజాత ఆమెను వదినగారూ అని పిలుస్తుంది. సుజాతను కూడా ఆమె వదినగారూ అని పిలుస్తుంది. మాటల సందర్భంలో ఈ వంకాయలు నేను తెచ్చానని సుజాత చెప్పడం, ఆమె వాటి ఖరీదు అడగడం, సుజాత చెప్పడం, చాలా ఖరీదు పెట్టారమ్మా మీ వారు అని ఆమె అనడం, మా అన్నయ్యగారూ ఇలాగే తెస్తారా అని వాళ్ళాయన గురించి సుజాత అడగడం, అబ్బే అదేం లేదంటూ సాగదీసుకుంటూ, సంబర పడిపోతూ, చేతు లాడిస్తూ ఆమె చెప్పడం సుజాత ముఖం చిన్న బోవడం క్షణాల్లో జరిగి పోయింది.

ముందు గదిలో పేపరు చదువుకుంటున్న నాకు అన్నీ వినిపిస్తున్నాయి.

"అయితే వదినగారూ, అన్నయ్యగారికి కూరలు కొనడం కొద్దిగా తెలీదన్న మాట" అన్నది పక్కింటి వదినగారు చాలా నెమ్మదిగా రహస్యం మాట్లాడు తున్నట్లుగా.

"కొద్దిగా ఏమిటి? బొత్తిగా తెలీదు" అంది సుజాత కత్తిపీటను ధడాలున పక్కన పెడుతూ.

ఆ రోజు నుంచి కూరలు కొనడం ఎలా?" అని తీవ్రంగా ఆలోచించాను. ఆఫీసులో కూడా చాలా మందిని అడిగాను కూర లెలా కొనాలని. అన్నీ తెలుసుకున్నాను కానీ మళ్ళీ కూరలు కొనే యోగం పట్టలేదు.

* * * *

"అదేమి" అన్నాడు అనంతరావు.

"మా పక్కింటి వదినగారు చెప్పిన జడ్జిమెంట్ ప్రకారం నాకు కూరలు కొనడం రాదు. దానికి శిక్షగా సుజాత తనే కూరలు కొని తెచ్చుకుంటోంది."

"చాలా ఘోరం జరిగింది గురూగారూ" భారంగా నిట్టూర్చాడు అనంతరావు.

మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాను.

"ఆ తర్వాత పది రోజులకు సుజాత పుట్టిన రోజు వచ్చింది. దసరా కూడా అప్పుడే. చీర కొనాలను కున్నాను. నీ దగ్గరేగా అనంతం! డబ్బు అప్పు తీసుకున్నాను.

"అవును గురూ గారూ ఈ నెలలో ఇచ్చేస్తా నన్నారు. ఇవ్వనే లేదు" అన్నాడు అనంతం.

"సణక్కు. వచ్చే నెల్లో ఇచ్చేస్తాలే. చెప్పేది విను. నీ దగ్గర డబ్బు తీసుకుని చీర కొని పట్టు కెళ్ళాను."

* * * *

"చీర చాలా బాగుందండి. ఈ కలర్ ఇంతవరకు కట్టుకో లేదు. పక్కింటి వదినగారూ ఇలాంటిదే కొనుక్కున్నారు. ఎంత ఖరీదు? నూట నలభయ్యేనా? అంది సుజాత.

ఆ చివరి మాటకి నా ప్రాణం పోయినట్లైంది. నేను నూట అరవైకి కొన్నాను ఆ చీరని.

"ఉండండి. పక్కింటి వదిన గారికి చూపిస్తాను. ఆవిడ కొనుక్కున్నారు నూట నలభైకి. అది కూడా తెస్తాను. చూద్దురు గాని" అంటూ వాళ్ళ వాటాలోకి వెళ్ళింది సుజాత.

కాస్సేపటికి రెండు భుజాలమీద రెండు చీరలు వేసుకుని వచ్చింది సుజాత.


వెనకాలే వదిన గారొచ్చింది.

"నా చీర నూట నలభయ్యింది అన్నయ్యగారూ. రవీంద్ర క్లాత్ స్టోర్స్‌లో కొన్నారు మా వారు. మీరూ అక్కడే కొన్నారేమిటి కొంపదీసి" అన్నదామె.

"ఆ.... అవును" అన్నాను తడబడుతూ. నా గుండె అదుపు తప్పినట్లయింది. "నూట నలభైకే కొన్నాను నేను కూడా" అన్నాను గొంతు పెగుల్చుకుని. ఇరవై రూపాయల తేడా! బాప్‌రే!

వదినగారు ఏదోగా నవ్వుకుంటూ వెళ్ళి పోయింది ఆమె చీరతో సహా.

కాస్సేపటికి టీ ఇచ్చింది సుజాత. దగ్గర కూర్చుని మాట్లాడుతూ నా జేబులో చెయ్యి పెట్టింది. సుజాత చేతికి నేను కొన్న చీర బిల్లు తగిలింది. నేను గబుక్కున లాక్కునే లోపల సుజాత బిల్లు చూసింది. బిల్లుమీద అంకె నూట అరవై. సుజాత నా వైపు చాలా తీక్షణంగా చూసింది. నేను నిజంగా నూట



నలభైకి కొన్నానని వదినగారు వచ్చి అదోలా నవ్వుతూ "నూట నలభైకి కొన్నారా మీరూను" అనేసరికి మాట్లాడలేక పోయానని సుజాతకు చెప్పాలను కున్నాను. నాకు ఆ అవకాశం దొరక లేదు.

"ఇంకెప్పుడూ ఏ వస్తువూ కొనకండి" అంటూ చీర బిల్లు చింపి పారేసింది.

ఆ క్షణం నుంచి నాకు నిజంగా మార్కెట్ వ్యవహారాలు తెలియవని నిర్ణయాని కొచ్చేసింది సుజాత. వదినగారి మొగుడు ఏ వస్తువుకొన్నా దాని గురించి ఆమె గొప్పగా సుజాతకు చెప్పడం, నాకు ఆ విధంగా తీసుకు రావడం చేత కావట్లేదనే భావంతో సుజాత ముఖం చిన్న బోవడం, వదినగారు ఇంకా గొప్పలు పోవడం.... ప్చ్.... ఎన్నాళ్ళిలా.

* * * *

"చాలా ఇబ్బంది పడిపోతున్నారు గురూ గారూ! నేనేవిధంగా మిమ్మల్ని ఆదుకో గలను. ఇంకో సిగరెట్ వుంటే ఇస్తారా?" అన్నాడు అనంతరావు.

సిగరెట్ ఇస్తూ అన్నాను.

"నిన్న సాయంత్రం సినిమాకు వెళ్ళాం నేను సుజాతా. బయల్దేరుతూ వదినగారితో చెప్పి రావడానికని వెళ్ళింది సుజాత. అప్పుడు వదిన గారే మన్నారో తెలుసా?"

"ఆమె కూడా వస్తానన్నా రేమిటి కొంపతీసి" అన్నాడు అనంతరావు.

"మీ వారు పువ్వులు కొనేటప్పుడు ప్రక్కన నువ్వుండు సుజా. సినిమా టిక్కెట్లు కూడా బేరమాడేస్తారేమో జాగ్రత్త అన్నది వదినగారు నవ్వుతూ."

"అలాగే నండీ తప్పదు కదా!" అంది సుజాత నా వైపు గుర్రుగా చూస్తూ.

"అందుకని అనంతం ఇదంతా వదినగారి వల్లనే జరుగుతోం దేమోనని పిస్తోంది నాకు."

అనంత రావన్నాడు,

"నా కర్మమైంది గురూ గారూ! ఎదుటి వాళ్ళు కలతల్లో వున్నారంటే సంతోషించే రకం పక్కింటి వదినగారు. మీ రిద్దరూ క్రొత్త దంపతులు పరస్పరం మీకు సుజాతగారికి సరైన అవగాహన కుదర లేదు. ఈ పరిస్థితుల్లో మిమ్మల్ని ఎద్దేవా చేసినట్టు మాట్లాడితే సుజాత గారి దృష్టిలో మీరు ఏమీ తెలియని వారవుతారు. మొగుడు పెళ్ళానికి చులకనయ్యేది పెళ్ళయిన మొదటి రోజుల్ని బట్టే వుంటుంది గురూగారూ. మీ కన్నా ఆమె భర్త వ్యవహార జ్ఞానం కలవాడని చెప్పడానికి ప్రయత్నిస్తోంది వదినగారు. ఇటువంటి టైంలో నే పరిష్కరించు కోవాలి. దీని కంతటికీ ఒకటే కారణం."

"చెప్పు అనంతరావూ అదేమిటో చెప్పు. చచ్చి నీ నోట సిగరేట్ నై పుడతా!"

"వద్దు గురుగారూ అంత త్యాగం భరించ లేను" అన్నాడు అనంతరావు.

"పోనీ నీకు ఆఫీస్ లో బాస్ నై పుడతాను."

"వద్దు గురూగారూ ఈ రేంక్ నుంచి పైకి వెళ్ళొద్దు. మీరు ఇలాగే వుండండి. చాలు" అన్నాడు అనంతరావు కంగారు నటిస్తూ.

"మరయితే ఈ సమస్యను పరిష్కరించు!"

"అలాగే గురూజీ" అంటూ అనంతరావు చెప్పడం మొదలు పెట్టాడు. అనంతరావు చెప్పింది సాంతం విన్నాను. నాకూ ఆ సలహా చాలా బాగుందని పించింది.

"ఇవాళ సాయంత్రమే దాన్ని అమలు చెయ్యాలి!"

* * * *

అనంతరావు చెప్పిన ఉపాయానికి చాలా కృతజ్ఞతలు చెప్పి ఆఫీసు నుంచి ఇంటి కొచ్చేసాను.

మార్కెట్లోకి వెళదాం తయారవ మన్నాను సుజాతను. దసరాకు నేను కొన్న నూట అరవై చీర కట్టుకో మన్నాను. సుజాత ఆ చీర కట్టుకుంది.

ఇద్దరం బయల్దేరాం.

రోజూ వెళ్ళిన దారిన కాకుండా వేరే రోడ్డున

# ఇదిగో.... వదినగారూ!

బయల్దేరాం!

"ఇటెక్కడి కండీ" అంది సుజాత.

"చెప్తాను నడు!"

కొద్దిసేపు నడిచేసరికి సుజాత వున్నట్టుండి అన్నది. "అన్నయ్యగారు వస్తున్నారండీ!"

"ఏడీ" అన్నాను.

"ఏడీ ఏమిటి తప్పు మాట వదినగారి భర్త. వింటే ఏమనుకుంటారు" అంది సుజాత.

మా మాటలు పూర్తయ్యే లోపల వదినగారి భర్త సన్యాసిరావు గారు మా దగ్గరి కొచ్చాడు సైకిల్ మీద.

"ఏమ్మా! ఇటు వెడుతున్నా రేమిటి?" సైకిల్ దిగి నిలబడుతూ అన్నాడు సన్యాసిరావు.

"అలా షికారుకని బయల్దేరా మండీ!" అంది సుజాత. కాస్సేపు ముగ్గురం మాట్లాడుకున్నాం.

అన్నట్టు ఈ చీర పండక్కి కొన్నది కదూ!" అన్నాడు సన్యాసిరావు.

"అవునండీ. నూట అరవైకి కొన్నాను. మీరు ఇటువంటి చీర నూట నలభైకి కొన్నారట కదా!" అన్నాను.

"నూట నలభైకి కొనడ మేమిటి? నేను కూడా నూట అరవైకి కొన్నాను!" అన్నాడు సన్యాసిరావు.

నేను సుజాత తెల్లబోయాం.

"మీరు నూట నలభైకి కొన్నట్టు వదినగారు చెప్పారు!" అంది సుజాత నసుగుతూ.

"దాని పిండాకూడు. దానికేమన్నా తెలిసి ఛస్తేగా. ఇంత ఖరీదుకి తెచ్చానని ఎప్పుడూ దానికి చెప్పను. నోటి కొచ్చిన ఖరీదు చెప్పు కుంటుంది అందరికీ" అన్నాడు సన్యాసిరావు.

"అదేమండీ!" అన్నాను విస్తుబోతూ.

"గొప్పకోసం. అందరి మొగుళ్ళకన్నా నేను నయం అనిపించాలని ఒకటి. మరొక కారణం కూడా వుందనుకో...." అన్నాడు సన్యాసిరావు సందిగ్ధంగా.

"అదేమిటో చెప్పండన్నయ్యగారూ!" అంది సుజాత.

"నాకు ఆఫీసులో పైన కాస్త డబ్బులు దొరుకుతాయి. జీతం కాక వచ్చిన డబ్బులు కదా మరి! పై సంపాదనతో మేము ఖరీదయినవి కొనేసు కుంటున్నామని అందరూ అనుకోకుండా వుండడానికని మా ఆవిడ అలా చెప్పు కుంటుంది!" అన్నారు సన్యాసిరావు.

ఆ మాటకు సుజాత ముఖం వికసించింది. నా వైపు చాలా లవ్లీ లునే విసిరింది.

"మొగుడి పెర్ఫెక్ట్ నెస్, వ్యవహార జ్ఞానం పెళ్ళానికి తెలుస్తే చాలు" అన్నాడు అనంతరావు. ఆ మాటలు చూపులతో నిజం చేసింది సుజాత.

కాస్సేపు మాట్లాడేక వదినగారి భర్త సన్యాసిరావు కిరాణా షాపు వైపు వెళ్ళి పోయాడు కందిపప్పు గట్రా కొనాలని.

మేము వెనక్కి వచ్చేసాం. నేను సుజాతను మార్కెట్ కి తీసుకొచ్చిన పనయి పోయింది. వదిన గారి భర్తను కలవడానికని సుజాతను ఈ త్రోవను తీసుకొచ్చాను. ఇది అనంతరా విచ్చిన సలహా.

* * * *

మర్నాడు ఉదయం.

వదినగారు గ్లాసుతో కందిపప్పు పట్టుకొచ్చింది. సుజాత దగ్గర ఆ మధ్య నెప్పుడో అప్పు పట్టు కెళ్ళిందట. బాకీ తీర్చడాని కొచ్చింది. కందిపప్పు తీసుకుంటూ సుజాత అన్నది.

"కందిపప్పు మరీ నాసిగా వుంది వదినగారూ. నిన్న మా వారు చాలా మంచి పప్పు తెచ్చారు."

అలాగా! మా వారు మంచిదే తెచ్చేవారు కానీ నిన్న ఆయనకు చాలా పని లండటం వల్ల నేను తెచ్చాను కందిపప్పు" అంది వదినగారు.

"అయ్యో! మీరు బజారు కెళ్ళారా. నాకు చెబితే మా వారు తెచ్చేవారుగా మీక్కూడా" అంది సుజాత.

"అబ్బే ఎందుకు శ్రమ. మా వారు మంచిదే తెచ్చేవారు" అంది వదినగారు.

"శ్రమ దేముందండి. అన్నట్టు నిన్న మీ వారు మా వారికి బజార్లో కనిపించార్ట కందిపప్పు కొంటూ. చాలా సేపు మాట్లాడు కున్నారట" అంది సుజాత వోరగా వదినగార్ని చూస్తూ.

"అలాగా! మా వారు చెప్పలేదే!" అంది వదినగారు ఏమనాలో తోచక.

"అవునండీ పక్క పక్క వాటాల్లో వుంటున్నప్పుడు మగవాళ్ళు కూడా మాట్లాడుకుంటూ వుండాలని మా వారి ఆఫీస్ కొలీగ్ అనంతరావు గారు చెప్పారట. పండక్కి మీ అన్నయ్యగారు నాకు కొన్న చీర గురించి సన్యాసి రావన్నయ్య గారు చివాట్లేసారంటే నమ్మండి వదినగారూ" అంది సుజాత.

వదినగారు పనుందంటూ విసవిసా వెళ్ళి పోయింది.

సుజాత వేడి కాఫీ కప్పుతో నాకు దగ్గరయింది. □

